# మన స్వాస్థ్యము

భక్త్ సింగ్

ఐదవ ముద్రణ : అగస్టు 2000; 3000 ప్రతులు

పుస్తకములు కావలసినవారు
ఈ క్రింది అడ్రస్‌కు వ్రాయమనవి

"హెబ్రోను"
గోల్కొండ చౌరస్తా
హైదరాబాద్ - 500 020 (ఆం.ప్ర.)

ముద్రణ :
ఎస్. ఎస్. గ్రాఫిక్స్
నల్లకుంట, హైదరాబాద్

# ఉపోద్ఘాతము

యెహోషువా గ్రంథమునందు మన ప్రేమగల, జీవముగల దేవుడు మన గొప్ప ఆత్మీయ స్వాస్థ్యమును ఏ విధముగా మనము విశ్వాసముతో స్వాధీనపరచుకొన గోరుచున్నాడో తెలియపరచబడినది, ఐశ్వర్యవంతమైన ఫలభరితమైన కనాను దేశమును స్వాస్థ్యముగా నివ్వవలెనను ఉద్దేశముతో దేవుడు ఇశ్రాయేలు జనాంగమును ఐగుప్తునుండి విడుదల చేసెను. అదే విధముగా యేసుక్రీస్తు ప్రభువు మన పాపములను క్షమించుట మాత్రమే కాక "....అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియు; వరలోకమునందు భద్రపరచబడిన" (1 పేతురు 1:4) పరలోకపు స్వాస్థ్యములో మనము సంపూర్ణ భాగమును తీసుకొనవలెనని కోరుచున్నాడు. అపొస్తలుడైన పౌలు దానిని "తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యము" (కొలస్స. 1:12) అనియు, ఎఫెసీ. 1:14లో పరిశుద్ధాత్ముడు ఈ స్వాస్థ్యమునకు సంచకరువుగా ఇవ్వబడి యున్నాడనియు చెప్పుచున్నాడు.

కనాను దేశము, క్రీస్తులో మన ఆత్మీయ స్వాస్థ్యమునకు మచ్చుగా నున్నది. ఆ సమయములో కనాను సమృద్ధియైన నీటితోను శ్రేష్ఠఫలములతోను నిండిన ఫలభరితమైన దేశము. దీనికి విరోధముగా ఐగుప్తులో ఇశ్రాయేలు జనాంగము ఎంతో శ్రమపడి బానిసలుగానే ఉండవలసి వచ్చెను. కనానులో సమస్తము సమృద్ధిగా నుండెను. అది కొలస్స 2:9,10లో వ్రాయబడినట్లు మనము క్రీస్తులో అనుభవించు పరిపూర్ణతను సూచించుచున్నది. మనము విశ్వాసముతో ఆ స్వాస్థ్యమును స్వాధీనపరచుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు. మనము నిత్యజీవమును ఉచితముగా పొందుచున్నాము

కాని, స్వాస్థ్యములోని మన భాగమును అను దినము విశ్వాసముతో కోరుకొనుచు అన్వయించుకొనవలెను. ఏ రీతిగా ఒక ఐశ్వర్యవంతమైన కుటుంబములో పుట్టిన బిడ్డ ఆ కుటుంబపు ఆస్తిపై హక్కు కలిగియుండునో అదేరీతిగా దేవుని కుటుంబములోనికి జన్మించిన ప్రతి విశ్వాసికి పరలోకపు స్వాస్థ్యముపై హక్కు గలదు. కాని దానిని విశ్వాసముతో స్వాధీనపరచుకొనవలెను.

ఈ పరలోక స్వాస్థ్యమును స్వాధీనపరచుకొనుటకు సహాయపడు కొన్ని ముఖ్య విధానముల నిపుడు మనము చూచెదము.

## I. సామాన్య విశ్వాసము

మన స్వాస్థ్యమును విశ్వాసముతో ఏ విధముగా స్వాధీనపరచు కొనగలమో యెహోషువ గ్రంథములోని 2వ అధ్యాయములో నున్న రాహాబు చరిత్ర బోధించుచున్నది. కుటుంబము, దేశము మున్నగు వాటినిబట్టి చూచినచో దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు ఇవ్వగోరిన స్వాస్థ్యములో వేశ్యయగు రాహాబునకు హక్కు లేదు. పట్టణములోపలగాక పట్టణపు ప్రాకారము మీద ఆమె ఇల్లు ఉండుటకు ఇదియొక కారణమయి ఉండవచ్చును. ఆశ్చర్యరీతిగా, నిరాకరింపబడిన ఈ స్త్రీ యందు ఇశ్రాయేలు గొప్ప దేవునియందు ఆమెకుగల నిజమైన విశ్వాసమును మనము కనుగొనుచున్నాము. ఆ పట్టణములోని ఇతర ప్రజలకూడ దేవుడు తన ప్రజల పక్షమున చేసిన అద్భుత కార్యములను విని భయముతో నిండియుండిరి. కాని రాహాబు వేగుల వారితో "... మీ దేవుడైన యెహోవా, పైన ఆకాశమునందును క్రింద భూమి యందును దేవుడే అని చెప్పగలిగెను (11వ.వ.) మరియు ప్రభువు వారికి ఆదేశమును అప్పగించెనని కూడా నమ్మెను. యెరికో పట్టణము మీదను దాని స్వాస్థ్యము మీదను దేవుని తీర్పును ఆమె విశ్వాసముతో చూచి తన కొరకును. తన కుటుంబము కొరకును విడుదలను కోరుకొనెను, ఆ సమయములో ఇశ్రాయేలు ప్రజలు ఇంకను యొర్దానును కూడా సమీపించలేదు, మరియు కనాను దేశము ఏడు గొప్ప జనాంగములతో నిండియుండెను. కాని రాహాబు ఆ దేశము వారికి ఇవ్వబడినదని చెప్పగలిగెను. (9వ, వ) అట్టి విశ్వాసముతో అమె దేవుని ప్రజల స్వాస్థ్యములోనికి వచ్చెను. ఇది జరిగిన సమయములో ఆ స్వాస్థ్యములో తన భాగమును గూర్చి ఆమెకే అభిప్రాయమును లేదు. రానున్న తీర్పునుండి తప్పించుకొనవలెనని మాత్రమే ఆమె తలచెనుగాని, దేవుడు ఆమెను పాపపు జీవితము నుండి తప్పించుటయేకాక పరిశుద్ధమైన ఏర్పరచబడిన జనాంగములో చేర్చెను. ఈ విధముగా ఆమె దావీదుకు ముదిఅవ్వ ఆయెను. (మత్తయి 1:5) మరియు యేసుక్రీస్తు ప్రభువు

కూడా ఆ వంశములో జన్మించెను. యీ విధముగా మొట్టమొదటిగా ఆమెకు నిజమైన, జీవముగల దేవుని యందు గల విశ్వాసముద్వారా ఆ స్వాస్థ్యములోనికి తీసుకొని రాబడెను.

## 2. పంచుకొనుట

తరువాత రాహాబు తన కుటుంబపు వారిని గూర్చిన చింత కలిగి యుండుట చూచుచున్నాము. ఆమె వేగులవారిని తన తండ్రి కుటుంబపు వారిపై దయచూపించి, వారిని చావకుండ బ్రతుకనిచ్చి రక్షించునట్లుగా కోరుకొనుచు నిజమైన ఆనవాలును అడిగెను. (11, 12వ). అదేవిధముగా అపొ. కార్య. 16:31లో నివ్వబడిన వాగ్దానము ప్రకారము. ప్రతి విశ్వాసి తన కుటుంబము కొరకు రక్షణను కోరుకొనవచ్చును. విశ్వాసముతో తన బంధుమిత్రుల కొరకు రక్షణను కోరుకొనినపుడు గొప్ప పరలోకపు స్వాస్థ్యములో మనకు పూర్ణభాగము ఇవ్వబడును. అనేకులు తిరిగి జన్మించితిమని చెప్పుదురు కాని వారిని, వారి స్నేహితుల కొరకు. వారి కుటుంబీకుల కొరకు ప్రార్థించుచున్నారా?" అని ప్రశ్నించినచో వారికి జవాబు లేదు. మనము కూడా మన బంధువుల రక్షణ కొరకు చింత లేనివారమైన యెడల ఆ స్వాస్థ్యములో పూర్ణభాగము మనకు లభించదు. మనము దేవుని వాగ్దానమును కోరుకొనుచు మారుమనస్సు పొందని మన బంధువుల పక్షమున ఎడతెగక విజ్ఞాపనము చేయుచుండవలెను. మన ప్రార్థనలకు జవాబు లభించక మునుపు మనము చాలా కాలము వేచి యుండవలసి వచ్చును. కాని, మనము అలసట చెందక ఎడతెగక ప్రార్థించుచూ కుటుంబమంతటి విడుదల కొరకై వాగ్దానములను కోరుకొనవలెను.

## 3. రక్త ప్రోక్షణ

తరువాత రాహాబు కిటికీకి ఎఱ్ఱని దారమును కట్టెను. విశ్వాసముతో ఆమె రక్తప్రోక్షణ క్రిందికి వచ్చెనని దీనియర్థము. ఐగుప్తులో రక్తమును ఇండ్ల ద్వారబంధపు రెండు నిలువు కమ్ములమీదను.

పైకమ్మిమీదను చల్లుట ద్వారా మరణదూత నుండి ఏ విధముగా విడిపింపబడిరో, ఆ విధానమును వేగులవారు ఆమెతో చెప్పి యుండ వచ్చును. ఆమె విశ్వాసముతో తనవారి నందరిని ప్రోగుచేసి ఎర్రని దారమును కట్టెను. అనగా ఆమె, వారినందరిని రక్త ప్రోక్షణ క్రిందికి తెచ్చెను. తద్వారా ఆమె కుటుంబపు వారు రానున్న తీర్పునుండి విడుదల నొందిరి. యెహోషువ, ఇశ్రాయేలు జనాంగము, ఇంకను చాలా దూరములో నున్నప్పటికిని ఆమె సమయమును వ్యర్థము చేయక వెంటనే దీనిని చేసెను. యెరికో దట్టమైన ప్రాకారములు గలిగిన గొప్ప పట్టణమయినప్పటికిని, ఇశ్రాయేలు జనముతో పోరాడుటకు ఆ పట్టణములో పరాక్రమము గల బలాఢ్యులున్నప్పటికిని, ఆమె జీవముగల దేవుని విజయము నందు స్థిరమైన, బలమైన విశ్వాసమును కలిగియుండెను. అందువలననే ఆమె ఆలస్యము చేయక ఎర్రని దారమును కట్టెను. విశ్వాసము వలన, అనగా సామాన్యమైన విశ్వాసము వలననే మనము రక్షణమ కోరుకొనగలము. తద్వారా ఆ గొప్ప పరలోక స్వాస్థ్యమును పొందుటకు సిద్ధపడగలము.

## 4. శక్తిమంతుడైన నాయకుడు

ఆ తరువాత ఇశ్రాయేలు యోర్దానును దాటి కనానులో ప్రవేశంచు సమయము వచ్చెను. వారు నదిని అసాధారణమైన విధముగా దాటిరి యేసుక్రీస్తులోనున్న మన స్వాస్థ్యములోనికి ప్రవేశించి ఆనందించుటను గూర్చి ఇది కూడా కొంచెము విపులముగా తెలుపును. "మీకును దానికిని (యెహోవా మందసమునకును) దాదాపు రెండువేల కొరమూరల యెడముండ వలెను. మీరు వెళ్ళు త్రోవ మీరింతకు ముందుగా వెళ్ళినది కాదు మీరు దానిని గురుతు పట్టవలెన"ని దేవుడు వారికి చెప్పెను (యెహో 3:4) యాజకులు నిబంధన మందసమును మోసికొనుచు వాగ్దాన దేశములో ప్రవేశించునపుడు, వారి పక్షమున యుద్ధము చేయుటకు దేవుడే వారికి ముందుగా పోవుచుండెను, వారు

వారి స్వంత బలము, శక్తి, సామర్థ్యము వలన నదిని దాటలేదు, మరియు, ఆదేశము నాక్రమించుకొనిన కనానీయులు, హిత్తీయులు, హివ్వీయులు, పెరిజ్జీయులు, గెర్గేసీయులు, అమోరీయులు, యెబూ, సీయులు అనబడు శత్రువులను కూడ జయించలేదు. జీవము గల శక్తిమంతుడైన దేవుడు తానే వారి మధ్య శక్తివంతమైన నాయకుడుగా నుండెనని ఆ మందసము వారికి జ్ఞాపకము చేసెను. ఆయన వారిని నడిపించి శత్రువులను వారి ముందునుంచి పారద్రోలును కాని, వారు వారి స్వశక్తిపైన సామర్థ్యత పైన, యుద్ధ పరికరముల పైన ఆధారపడకూడదు.

## 5. సంపూర్ణ విధేయత

యోర్దానునది అంత వెడల్పైన, లోతైన నదికాదు. అది 25 లేక 30 అడుగుల కంటే ఎక్కువ వెడల్పు లేదు. ఇశ్రాయేలు ప్రజలు దానిని దాటుటకు ఒక వంతెనను కట్టి యుండవచ్చును. లేక దానిని దాటుటకు ఓడలను ఉపయోగించి యుండవచ్చును. కాని మందసమును మోయు యాజకులు ముందుగా వెళ్ళవలయుననియు, తరువాత ప్రజలందరు వారిని వెంబడించ వలెననియు, దేవుడు వారికాజ్ఞాపించియుండెను. యాజకుల పాదములు నీటిని, తాకిన వెంటనే నీరు విభజింపబడెను. ప్రజలందరు ఎండిన నేలమీద దాటి పోయిరి. యోర్దాను నీరు ఆ స్వాస్థ్యమును పొందుటకు ఆటంకపరచు శారీరక పాప స్వభావమును సూచించును, ఆ స్వభావమును మన ఇచ్ఛాశక్తి చేతను, స్వంత బలము చేతను జయించవలెనని కోరినంత కాలము మనము అపజయ మొందుదుము. యేసుక్రీస్తు మన జీవితములను తన స్వాధీనము చేసికొనినపుడు మనము జయమును అనుభవించ గలము.

అపొస్తలుడైన పౌలు ఆ కాలములో అధిక యోగ్యతలు గల వారిలోనొకడు. తనలోనున్న నీతి విషయము తాను అనింద్యుడనని

చెప్పగలిగెను. అయినను తనలోనున్న మానవ యోగ్యతలపై ఆధారపడలేదు. కాని 'శరీరము నాస్పదము చేసికొనక' (ఫిలిప్పీ 3:1) అని చెప్పెను. "నేను కాను క్రీస్తే" అని కూడ చెప్పను. ఇశ్రాయేలీయులు నది దాటుటకు ఏ విధమైన వారి స్వంత ఏర్పాటును కలిగియుండక, దేవుడే వారికిచ్చిన నమూనాకు సంపూర్ణముగా విధేయులైరో అదే విధముగా మనము కూడా యేసుక్రీస్తు ప్రభువును పరలోకపు రాజుగా మన హృదయములలో సింహాసనమిచ్చి ఆయనకు సంపూర్ణముగా లోబడవలెను. యాజకుల పాదములు తగిలినంతనే నీరు విభజింపబడినట్లు ప్రభువు యొక్క శక్తి మన పక్షమున కార్యము చేయుచూ మనలను విజయములోనికి నడిపించుటను మనము కూడా చూచెదము. సాతాను మన తలంపులలో ద్వేషము, పగ, ఈర్ష్య, శరీరాశలు, అపవిత్రత, పేరాశ, గర్వము మున్నగు వాటిని రేపును. గనుక మన హృదయములతో మనము అనేక యుద్ధములను ఎదుర్కొనవలెను. ఈ ఆశలు, తలంపులు, భావోద్రేకములను మనము మన ఇచ్ఛాశక్తిచేతను, జ్ఞానము చేతను, తెలివిచేతను జయించలేము. "యేసుప్రభువా! ఈ పాపపు కోరికలను నాయంతట నేను జయించలేను. అవి నన్ను కలవరపెట్టుచున్నవి. నీవు నా పక్షమున వాటిని గెలువుము" అని మనము విశ్వాసముతో చెప్పవలెను. అప్పుడే మనము జయముతో సంతోషించగలము.

## 6. నిజముగా వెంబడించుట

యోర్దానును దాటిన తర్వాత ఇశ్రాయేలీయులు పొడవైన ప్రాకరములుగల యెరికోను జయించవలెను. వారికి ముందు నడుచుచున్న ప్రభువును వెంబడించుచు ఆయన ఆజ్ఞాపించిన దంతయు వారు చేసినప్పుడే శత్రువు ఓడింపబడుట వారు చూచెదరని దేవుడు వారితో చెప్పెను. దేవుడు ఇశ్రాయేలీయులతో వారు అట్టి మార్గమున ఇంతకు మునుపు పోలేదనియు, వారు ఐగుప్తులో పొందిన అనుభవ జ్ఞానముపై గాని గత కాలమందు పొందిన ఏ అనుభవము మీదగాని

వారు ఆధారపడకూడదని స్పష్టముగా తెలియచేసెను. ప్రభువు మాత్రమే ఆ మార్గమెరుగును. ఆయన ఒక్కడే వారిని నడిపించగల్గినవాడు. వారాయననే వెంబడించవలెను.

కనానులోని వివిధ పట్టణములు వేర్వేరు విధానములలో జయింపబడినవి. పట్టణములన్నియు యెరికో పట్టణము జయించబడిన విధానములోనే పట్టబడలేదు. ఆ రీతిగా ప్రభువు ఒక్కొక్కసారి ఒక్కొక్క విధానమును ఉపయోగించెను. ఆయన తన విధానములను ఒకదాని తర్వాత నొకటి యెహోషువకు తెలియజేయు చుండగా ఇశ్రాయేలీయులు వెంటనే దానిని అనుసరించుట వలన విజయములను పొందిరి. వారు నిబంధన మందసముపై తన దృష్టి నుంచి, దానిని వెంబడించుటకు వీలగునట్లు ప్రభువు వారికిని, మందసమునకును మధ్య ఎడముండవలెనని చెప్పెను. (యెహో. 3:4)

### 7. లోబరచుకొనుట

నదిని దాటుటకు ముందు తమ్మును తాము పవిత్ర పరచుకొనవలెనని ప్రజలతో చెప్పబడినది (5వ.వ) పరిశుద్ధ పరచుకొనుట అనగా మనలను మనము జీవము గల దేవునికి అప్పగించుకొనుట అని అర్థము. మనము మన స్వయము, ధనము, సంఖ్య లేక ఏ యితర మానవ అధికృతలపై ఆధారపడక, మన జీవితములపై ప్రభువునకు సంపూర్ణ అధికారమియ్యవలెను. అప్పుడు మాత్రమే ఆయన ప్రతి పరిస్థితిలో మన విషయమై బాధ్యత వహించి, మనలను అత్యధిక విజయశాలురనుగా చేయును.

### 8. సహవాసము

యాజకులు నిబంధన మందసమును మోయుచుండగా, ప్రజలందరును వారిని వెంబడించవలెను, మనము కూడా సంఘమంతటితో మనలను మనము ఐక్యపరచుకొనుట ద్వారానే అన్ని

ఆటంకములను జయించగలము. ఇతర విశ్వాసులతో సహవాసమును కలిగియుండి, సంఘమును కట్టుటలో మన భాగమును మనము తీసికొనవలెను. అనేక మంది విశ్వాసులు యితర విశ్వాసులతో సహవాసము కలిగియుండరు. ఇంటిలోనే వున్నను, కొన్ని మంచి పుస్తకములు చదివిన లేక మంచి పనులు చేసిన యెడల దీవించబడుదుమని వారనుకొందురు. ఈ దినములలో రోజంతయు రేడియోల ద్వారా వర్తమానములు వినవచ్చును. చాలమంది కేవలము వీటితోనే తృప్తి చెందుచున్నారు. వారు మంచి సంగీతము, వర్తమానము వినినచో దేవుని దీవెనలన్నియు పొందగలమని అనుకొనుచున్నారు. కాని ఆరాధన, ప్రార్థన లేక వాక్య పఠనముల కొరకై కూడివచ్చునప్పుడు కలిగియుండు సహవాసము యొక్క విలువను వారెరుగరు. కనుక రేడియోల ద్వారా వచ్చు వర్తమానముల వలన, ఏ మంచి పుస్తకము, పత్రికల వలన సంపూర్ణ ఆశీర్వాదము దొరకునని తలచి సహవాసమునకు దూరముగా నుండకుము. ఆ విధముగా నీవు అధికారము లేని వాడవుగా, శక్తి లేనివాడవుగనే యుందువు. ఆ విధముగా చేయుట వలన అవగా సహపాటి విశ్వాసులుగా, ప్రార్థనలో, సహవాసములో పలుమార్లు కూడుకొనుట ద్వారా పొందు లాభములను నీవు పోగొట్టుకొందువు. మన బలము, ఎదుగుదల ఒకరితో నొకరు కూడు సహవాసముపై నాధారపడి యుండును. ప్రారంభములో విశ్వాసులు ఎడతెగక అపొస్తలుల బోధ యందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి గనుక ఆత్మీయముగా వారు ఎదుగ నారంభించిరి. (అపొ. కార్య. 2.42)

**9. చాలినవాడు**

ఏ ఒక్కరు విడిచిపెట్టబడక ప్రజలందరు నదిని ఆవలిగట్టుకు దాటువరకు మందసమును మోయు యాజకులు నదిలోనే యుండిరి.

కనుక దేవుడు ప్రతి విశ్వాసికి స్వాస్థ్యమును స్వాధీనము చేసికొనుటకు చాలినంత ఏర్పాటును చేసియున్నాడు. ఆ గొప్ప అధిక్యత అపొస్తలుడైన పౌలు, మరియు గొప్ప వ్యక్తులకేనని తలంచి మనము వెనుకాడవచ్చును. కాని మన స్వంత సామర్థ్యముపై ఆధారపడక యేసుక్రీస్తు ప్రభువు యొక్క సిలువపై సామాన్య విశ్వాసముంచుట ద్వారా ఆ స్వాస్థ్యములో మన భాగమును పొందగలమని దేవుడు మనకు చూపించుచున్నాడు. కాని విశ్వాసము ద్వారా యేసుక్రీస్తు యొక్క విజయమును మనము కోరుకొన వచ్చును.

## 10. పైకి చూచుట

కొలస్స. 3:1,2లో మనము పైనున్న వాటినే వెదకి పరలోక సంబంధమైన వాటిమీద మన మనస్సుంచవలెనని అపొస్తలుడైన పౌలు హెచ్చరించుచున్నాడు. ఇది మన పరలోకపు స్వాస్థ్యమునకు కూడా ప్రయోగింపవచ్చును. మనము తిరిగి జన్మించక మునుపు మన ఆదాయమును ఎక్కువ చేయుట యందు, లోక వస్తువులు, ఆస్తులయందు చింత కలిగి యుంటిమి. దేవుని బిడ్డలముగా మన హృదయములు పర లోకపు వస్తువులపై నుంచవలెను. తరువాత 9,10 వచనములలో ప్రాచీన స్వభావమును దాని క్రియలతో కూడా పరిత్యజించి దేవుని పోలిక చొప్పున నవీన స్వభావమును ధరించుకొనవలెనని అపొస్తలుడైన పౌలు వ్రాయుచున్నాడు. ఇశ్రాయేలు ప్రజలు పాత జీవితమును విడిచి, సంపూర్ణముగా కొత్త జీవితములోనికి ప్రవేశించిరని వారు నదిని దాటుటలోని అర్థము. కనుక మనము కూడా యేసుక్రీస్తు ప్రభువు మన పాత పురుషుని, వాని పాపపు స్వభావముతో కూడా తీసివేసెనని విశ్వసించి, ఆయన మృతులలో నుండి తిరిగి లేచుటలో చూపించిన ఆ నూతన జీవమును విశ్వాసముతో కోరుకొనవచ్చును. ఆ జీవితము ద్వారా పరలోక స్వాస్థ్యమును పొందుటకు మనము సిద్ధపడవచ్చును.

## 11. పోషణ

అనుదిన కార్యక్రమముల కొరకు కావలసిన శరీర బలమునకు ఆహారము ఏ విధముగా అవసరమో అదే విధముగా వివిధ బాధ్యతలను వహించుటకు, వివిధ శోధనలను జయించుటకు యేసుక్రీస్తు జీవమవసరము. ఒకసారి భుజించి చాలా కాలము బలముగా నుండుటకు వీలుకాదు, మనము ప్రతిదినము రెండు, మూడు పర్యాయములు భుజించునట్లు మన శిరరములు నిర్మింపబడి యున్నవి. అత్మీయముగా కూడా అదే విధానమున్నది. బలమును పొందవలెనన్నచో యేసు ప్రభువు జీవమును విశ్వాసముతో తీసుకొనవలెను. 'ప్రభువా నీ జీవమే నా జీవము. ఈ దినపు పనులకై, కార్యక్రమముల కొరకై ఆ జీవము నాకవసరము' అని అనుదినము మనము ఆయనకు చెప్పవచ్చును. ఈ విధముగా బలము నొంది మనము మన బలహీనతలను జయించవచ్చును. లేని యెడల మనము తప్పిపోయి బలహీనులముగానే యుందుము.

## 12. శుభ్రపరచుట

యోర్దాను నదిని దాటిన తర్వాత ప్రభువు యెహోషువతో యోర్దాను నది మధ్య నుండి పన్నెండు రాళ్ళను తెచ్చుటకై గోత్రమునకు ఒక్కరి చొప్పున పన్నెండుగురిని ఎన్నుకొనుమని చెప్పెను. ఆ రాళ్ళను గిల్గాలులో నిలువబెట్టిరి (యెహో 4:20)

గిల్గాలు అనగా "దొర్లిపోయెను". ఐగుప్తులోని వారి జీవితము నిందాభరితమైనది. గిల్గాలులో వారినింద దొర్లిపోయెను. దేవుడు వారి గత పతనములను, అపజయములను, అవమానములను, నిందలను దొరిలింపచేసెను. సాతాను మనలను ఓడించుటకు మన గత పతనములను తరచుగా జ్ఞాపకము చేయుచు దానినే ఒక బలమైన సాధనముగా వాడుకొనును, "ఆ పతనము ఏమిటి, ఆ ఓటమి, ఆ పాపమా" అని వాడు ఎడతెగక గుర్తు చేయుచూ నుండును. ఆ రీతిగా

మనము నిరుత్సాహము చెంది, "క్రీస్తులోని స్వాస్థ్యమును పొందుటను గూర్చి నావంటి మనుష్యుడు ఏ రీతిగా ఊహించవచ్చునని" చెప్పుదుము. ఈ విధముగా అనేకమంది విశ్వాసులు తీర్పులోనికి, శిక్షావిధిలోనికి వత్తురు. మనము అటువంటి పావవు నేరారోపణ క్రిందనే యుండనవసరము లేదు. మన పాపపు మరకలను కడుగుటకై ఎడతెగక యేసుక్రీస్తు వారి రక్తమును కోరుకొనవచ్చును. ఆ రక్తము నందలి విశ్వాసముతో మనము శుభ్రముగాను, పవిత్రముగాను, ఉండవచ్చును. అపో. కార్య. 15:9 ప్రకారము మన తప్పిదముల నుంచి మనము విశ్వాసము ద్వారానే పవిత్ర పరచబడగలము. తలంపు, మాట, క్రియల ద్వారా అపవిత్రపరచబడిన ప్రతి సమయములో "యేసు ప్రభువా, నేను అపవిత్ర పరచబడితిని. దయచేసి నన్ను క్షమించుము. నన్ను నీ రక్తముతో కడిగి పవిత్ర పరచుము" అని చెప్పవము. అప్పుడాయన మనలను పవిత్ర పరచును. మనము ఆయన రక్తప్రోక్షణ క్రిందికి రాని యెడల మనము తీర్పు శిక్షావిధికి లోనగుదుము. ఆయన యొద్దకు విశ్వాసముతో రమ్ము. ఆయన ఏ నిందవంతయు దొర్లించును. మనలను మనము తగ్గించుకొని మన పాపముల నొప్పుకొని ఆయన ప్రశస్త రక్తము క్రిందికి తెచ్చుకొనిన యెడల ప్రభువు మనలను క్షమించి కడిగి మన పాపములన్నింటిని తీసివేయును.

## 13. ఆధారపడుట

ఇశ్రాయేలీయుల పిల్లలందరికి సున్నతి చేయించుమని దేవుడు యెహోషువకు ఆజ్ఞాపించెను. "... నా నిబంధన యేమనగా మీలో ప్రతి మగవాడును సున్నతి పొందవలెను". అని దేవుడు అబ్రాహాముతోను తరువాత అతని సంతానముతోను నిబంధన చేసెను. (ఆది. కాం. 17:10) అదే సమయములో దేవుడు అబ్రాహామునకు తప్పక కుమారుని ఇచ్చెదననియు, అతనిని అత్యధికముగా అభివృద్ధి చేసి కనాను దేశమును స్వాస్థ్యముగా నిచ్చెదననియు ఇంతకు మునుపు చేసిన వాగ్దానమును

జ్ఞాపకము చేసెను. ఆ సమయములో అబ్రాహాము వయస్సు తొంబది తొమ్మిది సంవత్సరములు. శారాకు ఎనభై తొమ్మిది సంవత్సరములు. మానవ రీతిగా కుమారుడు జన్మించుటకు వారి శరీరములో సామర్థ్యత లేదు. వారి స్వంత బలము చేతగాని శక్తి చేతగాని కాక, దేవుని స్వంత జీవము మరియు పునరుత్థాన శక్తి వలన మాత్రమే వారికి కుమారుడు కలిగెననియు, వారు ఫలించిరనియు, స్థిరపరచుటకై ప్రతి మగవాడు సున్నతి చేయించబడవలెనని దేవుడు అబ్రాహాముతో చెప్పెను. అదేవిధముగా వారు తమ స్వంత బలము, తెలివితేట చేతకాక ఆ స్వాస్థ్యమున దేవుని ఆత్మ, బలము, శక్తి ద్వారానే అనుభవించవలెనని యెహోషువ, ఇశ్రాయేలు ప్రజలు వారి హృదయములలో నుంచుకొనవలెను.

'శక్తి చేతనైనను, బలము చేతనైనను కాక నా ఆత్మచేతనే ఇది జరుగునని సైన్యముల కధిపతియగు యెహోవా సెలవిచ్చెను'అని ఇదే వర్తమానము జెరుబ్బాబెలుకు అందించబడుట జెకర్యా 4:7లో చూచుచున్నాము. యెరూషలేములో తిరిగి మందిరమును ఏవిధముగా కట్టించవలెనని అనేక సంశయములతోను, ప్రశ్నలతోను జెరుబ్బాబెలు నిండియుండెను. యిర్మీయా ప్రవచన ప్రకారము ఇశ్రాయేలు జనాంగము డెబ్బది సంవత్సరములు బబులోను యొక్క బానిసత్వములో నుందురని అతడెరుగును. యెరూషలేము యొక్క పడగొట్టబడిన గోడలను, అగ్నితో కాల్చబడిన ద్వారములను అతడు చూచెను. కొద్ది ధనముతో, కొద్దిపాటి సహాయముతో, కొద్దిమంది ఇశ్రాయేలీయులు జెరుబ్బాబెలుతో నుండిరి. ఈ పరిస్థితులలో దేవుని పని శక్తిచేతనైనను, బలము చేతనైనను, కాక తన ఆత్మచేత జరుగునని యెహోవా వాక్కు జెరుబ్బాబెలునకు వచ్చెను. మన స్వంత బలము చేత దేవునికి ఏ సేవయు చేయలేము, మన స్వంత ప్రయత్నముల ద్వారా మన స్వాస్థ్యములను అనుభవించి సంపాదించు కొనలేము. మనము దేవుని ఆత్మ మీద ఆధారపడి ఆయన ఆధీనములో నుండవలెను.

దేవుని నడిపింపును గమనించక ఆయన ఆజ్ఞలకు అవిధేయత చూపుట వలన మనము ఆత్మీయముగా అంధుల మగుదుము. అవిధేయత ద్వారాను, అసంపూర్ణ విధేయత ద్వారాను ఈ దినములలో అనేకులు దేవుని విషయములను గూర్చిన దృష్టిని కోల్పోయి ఉన్నారు.

ఉదాహరణకు సౌలు దేవునికి కొద్దిపాటి అవిధేయతను చూపించెను. దాని ఫలితముగా నతడు దేవుని చేత తృణీకరింప బడెను. తన గొప్ప సైన్యమును లెక్కించవలెనను శోధనలోపడి దావీదు తన బలము నందున్న గర్వమును చూపించుకొనెను (11 సమూ. 24:2.3). తన జయములన్నియు తన స్వంతబలము చేతకాక దేవుని వలననే కలిగినవని దావీదు బాగుగా ఎరిగి యుండెను. తన స్వంత బలము చేతగాని, తెలివిచేతగాని గొల్యాతును ఓడించలేదు. దేవుని నామముననే పోరాడి జయించెను. (1 సమూ. 17:46). కాని తన వృద్ధాప్యములో తన సైన్యమును లెక్కించుకొనవలెనను శోధనలో పడెను. సైన్యాధిపతియైన యోవాబు ఈ తప్పిదము నుండి దావీదును తప్పించుటకు ప్రయత్నించి నప్పటికిని దావీదు తీర్మానమే గెలిచెను. దావీదు దృష్టి గొప్ప సంఖ్యయైన తన ప్రజల మీదనే గాని, దేవుని మీద లేదని ఇది తెలియపరచెను. అందువలననే దావీదును తగ్గించి కళ్ళము వద్దకు దేవుడు అతనిని రప్పించెను. ఈ రీతిగా తాను దేవుని నమ్మవలెనని దావీదు నేర్చుకొనవలసి వచ్చెను.

ఇట్టి శోధనలు మనకందరికి సంభవించును. మనము శోధనలను జయించుటకు, దేవుని సేవ చేయుటకు మన శక్తిమీద, సామర్థ్యము మీద, జ్ఞానము మీద ఆధారపడుటకు శోధింప బడుదుము. అనేకులు వారి కెమెరాలపై, భవనములపై, ఆస్తులపై ఆధారపడుదురు. ఇవన్నియు కలిగియుండుట వలన అధిక ఫలములను, మంచి ఫలితములను వారు చూడగలరని తలంచెదరు.

ఫలవంతమైన పరిచర్యకై, ప్రతి అవసరతలు, శోధనా పరిస్థితులలో మనము మన భారమును ప్రభుపై పెట్టవలెను. బోధకులు నహితము గతించిన ఆశీర్వాదములపైన అనుభవములపైన ఆధారపడినచో, వారు అధిక ఫలములను చూడజాలరు. అనుదినము మన పెదవులను, నాలుకలను, గొంతుకలను ముట్టి తన ప్రజల కొరకైన తన వర్తమానమును దయచేయుమని ప్రభువును అడుగవలెను. అప్పుడే మన పరిచర్య జీవము కలిగి నూతనముగా నుంచబడును. తెలివిగలిగిన భార్యలు కొందరు మిగల్చబడిన అన్నముతో ఉదయకాలపు భోజనమును తయారు చేసెరు. వారు ఉప్పు, మిరియాల పొడి, చింతపండు మున్నగు పదార్థములతో వేయించుట ద్వారా దానిని క్రొత్త రుచిగల దానినిగా చేసెదరు. కొందరు బోధకులు వారి పాతవర్తమానములనే అధికముగా వాడుచుందురు. అది మనము సంపూర్ణ ఆశీర్వాదమును ఇవ్వదు. మనము మోకరించి మనలను అభిషేకించి తన వర్తమానము అనుదినము మనకు దయచేయుమని ప్రభువును అడుగవలెను. వర్తమానము యొక్క సిద్ధపాటునకు జయవంతమైన, ఉపయోగకరమైన జీవితమును కలిగి యుండవలెననినచో మన స్వంత తెలివిపైన సామర్థ్యత పైన, బలముపైన ఆధారపడకూడదు.

ఇవన్నియు నేర్పించుటకై ప్రజలకు సున్నతి చేయించ వలెనని దేవుడు యెహోషువకు చెప్పెను. స్వంత యుద్ధ పరికరముల మీద, గొప్ప సైన్య సమూహముపై, తెలివితో చేయు పన్నాగములపై కాక కేవలము ప్రభువు మీద ఆధారపడుట ద్వారానే వారు ఏడు గొప్ప రాజ్యములను జయించి కనాను దేశమును ఆక్రమించగలరని దేవుడు వారికి జ్ఞాపకము చేసెను.

## 14. పసిపిల్లలు

యెహోషువ 5:12లో మన్నా ఆగిపోయెనని మనము చదువు చున్నాము. ఇశ్రాయేలీయులు అరణ్యములో నున్నంతకాలము

అనుదినము దేవుడు వారికి మన్నానిచ్చెను, కనానులో ప్రవేశించిన మీదట అది ఆగిపోయెను. వారు ఆహారము కొరకై శ్రమ పడవలసి యుండెను. ఆత్మీయ పరిపక్వములోనికి మనము రావలెనన్న దేవునితో చురుకైన పాలిభాగస్థులము కావలెను. ఆరంభ ఆత్మీయ జీవితములో కొద్దికాలము ప్రభువు మనలను ప్రత్యేక రీతిగా పరామర్శించి కాయును, మనము ఎదుగు కొలది మన విశ్వాసమును అభ్యాసము చేసి వివిధ ఆత్మీయ ఫలమును ఫలించుట కొరకై ఆయనకు మొరపెట్టవలెనని దేవుడు ఎదురు చూచును. మన మాయన చిత్తమును అత్యాసక్తితో కనుగొని, మన బాధ్యతలను గుర్తెరిగి సామాన్యముగా అందరికి వచ్చు పరిశోధనలను, శ్రమలను దేవుని సహాయముతోను, పరిపక్వమైన నిశ్చయతతోను ఎదుర్కొనవలెనని దేవుడు కోరుచున్నాడు. ఈ రీతిగా విశ్వాసముతో ఆయన విజయమును మనము కోరుకొనవలెనని దేవుడు కోరుచున్నాడు.

అపొస్తలుడైన పౌలు ఆత్మీయ విషయములో తనను వెంబడించు వారి సహాయము కొరకు దేవుని వాక్యము నందలి అనేక మర్మములను బయలు పరచెను. అతడు దూరముగా నున్నప్పుడు వారి రక్షణను భయముతోను, వణకుతోను కొనసాగించమని వ్రాసెను (ఫిలిప్పీ 2:12) కొంతకాలము వరకు మనలను పోషించుటకు, నడిపించుటకు బోధించుటకు దేవుడు కాపరులను అనుగ్రహించును. తరువాత మనకొరకై మనము శ్రమపడుట నేర్చుకొనవలెను. లోతైన అనుభవ జ్ఞానముతో మనము బైబిలు చదువుటకు నేర్చుకొని దానిని ధ్యానించి, దాని ద్వారా దేవుని స్వరమును వినవలెను. కొందరు విశ్వాసులు చాలాకాలము పసిపిల్లలుగానే యుందురు. ఇతర దైవ సేవకులు వారిని పాలతో పోషించవలెనని కోరుదురు. దేవుని వాక్యములోని బలమైన ఆహారమును జీర్ణము చేసికొను సామర్థ్యతను పొందుటకు వారు ఎరుగరు. (హెబ్రీ 5:12,15) ఆయన స్వరమును విని, ఆయన పరిపూర్ణ చిత్తమును కనుగొనుటకు దేవుడు మనకు సహాయము

చేసి ఆత్మీయ ఎదుగుదలలో మనము ఇంకను పసిపిల్లలముగా నుండకుండునట్లు చేయునుగాక!

### 15. కనిపించని శక్తి

ఇప్పుడు ఇశ్రాయేలీయులు యెరికో ప్రాంతములందుండిరి. ఆ సమయములో యెహోవా సేనాధిపతి యెహోషువకు కనబడెను. ఈ దర్శనము ద్వారా (యెహో. 5:13-15) దేవుడు ప్రజల పక్షముగా పోరాడునని యెహోషువకు అభయమిచ్చుచుండెను. దీని తర్వాత యెహోషువ అనేక యుద్ధములలో పోరాడెను గాని దూత ఎప్పుడును కనిపించలేదు. అట్లు చెప్పబడను లేదు. కనిపించని రీతిగా ఆయన వారి పక్షమున పోరాడుచుండెను. (యెహో 21:43-45) అదే ప్రభువు మనతో కూడా నుండెనని వాగ్దానము చేసెను. మన జీవితములలో, ఏర్పాట్లలో అయన పూర్తి అధికారము క్రిందకు వచ్చిన యెడల ఆయన మనతో కూడా నుండి మన యుద్ధములలో ఆయన పోరాడును. యెహోవా సైన్యాధిపతి, పాదరక్షలు తీసివేయుమని యెహోషువతో చెప్పను. అనగా ప్రతివిధమైన అపవిత్రత నుండి వేరు కావలెను. మనము అటు ఇటు నడచి నప్పుడు ఏదో ఒక రీతిగా ఏదో ఒక స్థలములో తప్పక మురికి చేసి కొందుము. ఈ దుష్టలోకములో మనము ఉన్నంతకాలము మనము చూచు వాటి ద్వారా, వినుట ద్వారా, అపవిత్రులమగుదుము. అప్పుడు క్రీస్తు యొక్క ప్రశస్త రక్తమును మనలను కడుగుటకై కోరుకొనిన యెడల యెహోవా సైన్యాధిపతి అన్ని సమయములలో మనతో నుండును. ఈ రీతిగా రక్తము నందున్న సామాన్య విశ్వాసముతో అపవిత్రత లేనివారముగా నుంచబడి దేవుని సన్నిధానములో ఆనందించ గలము. ఆయనతో మన స్వాస్థ్యము. స్వతంత్రించుకొనగలము.

## ౧౮. పడగొట్టి, ప్రవేశించుట

యెరికో పట్టణము బలమైన గోడలను కలిగియుండినను, ఇశ్రాయేలీయుల భయముచే ద్వారములన్నియు గట్టిగా మూయబడి యుండెను. బలాఢ్యులు లోపలనే యుండిరి. ఎత్తయిన బలమైన ఆ గోడల దృశ్యమే ఎవరికైనను భయమును పుట్టించి యుండ గలదు. కాని ఇశ్రాయేలీయులకు భయము లేదు. యెరికోను దాని నివాసులతో వారిచేతి కప్పగించియున్నానని దేవుడు వారికి వాగ్దానము చేసియుండెను. (యెహోషువ 6:2) కనుక వారి యెరికోను సమీపించక మునుపే జయము వారిదేనని వారు నమ్మియుండిరి. యెరికోరాజు, అతని బలమైన శూరులు సాతానును, వాని దూతలను సూచించును. ఈ దురాత్మల సమూహముతో మనము పోరాడవలెను (ఎఫెసీ 6:12) కాని ఇంతకు మునుపే మన యేసు ప్రభువు సాతానును ఓడించి సిగ్గుపరచెను. (కొలస్సీ 2:15) మన పక్షమున యేసు ప్రభువు జయించెను. కనుక సాతాను తెచ్చు ప్రతి ఎదిరింపుపై మనము కూడా ఆయన జయమును విశ్వాసముతో కొడుకొన వచ్చును.

దేవుడు కోరిన ...ల యెరికోను తన దూతల ద్వారా నాశనము చేసియుండును. కాని ఇశ్రాయేలీయులు తన జత పనివారుగా ఉండవలెనని దేవుడు కోరెను. ఆయన జత పనివారమగుటకు బలమైన విశ్వాసమవసరము అందు కొరకు వారు దేవుని వాగ్దానములందు నమ్మిక యుంచి ఏ అనుమానము ప్రశ్న లేకుండా దేవుని ఆజ్ఞలకు విధేయత చూపవలెను. దేవుడు కోరిన యెడల, వారు పట్టణము చుట్టు ఒక్కమారు తిరిగిన యెడల గోడలు కూలియుండవచ్చును. ఆ విధముగా కాక వారు పట్టణము చుట్టు 13 పర్యాయములు తిరగవలసి వచ్చెను. వారు ఒక్కొక్కసారి తిరిగినప్పుడు వారి విశ్వాసము అంతకంతకు బలపడుచుండెను. గోడలపై నుండి ఎవరైన వారిని గమనించుచుండిన యెడల వారిని లక్ష్యము చేయకూడదని వారు చెప్పబడిరి. ఒకవేళ ఆ ప్రజలు వారిని చూచి నవ్వుచు ఎగతాళి చేసి యుండవచ్చును. మరియొక

వైపు వారు బూరలు ఊదుచు దేవుని విజయమునందు విశ్వాసముంచిరని ప్రకటించిరి. ఆ పట్టణము మీద పట్టణ నివాసుల మీద కాక వారి దృష్టి ప్రభువువైపు నిలిపిరి. ప్రభువు మాటల పైనున్న బలమైన చురుకైన విశ్వాసము వలనను ఆయన ఆజ్ఞలకు ఎదురు చెప్పక చూపిన విధేయత ద్వారా మాత్రమే వారు వాగ్దాన దేశములో ప్రవేశించి దానిని స్వతంత్రించుకొనగలిగిరి.

## 17. పవిత్ర పరచుట

ఇశ్రాయేలీయులు పట్టణము చుట్టు ఆరుదినములు ఒక్క మారును, ఏడవ దినమున ఏడు మార్లును తిరుగవలసి యుండెను. ఒక విశ్వాసి జీవితములో బలమైన విశ్వాసముంచుటకు పంపబడు అగ్నివంటి పరీక్షల నిది సూచించును. (1 పేతురు 1:6,7) ఏడుసార్లు అగ్ని పరీక్షలలో పోవుట ద్వారా బంగారు శుద్ధీకరించబడును. పరలోక స్వాస్థ్యములో మనము పూర్తి భాగమును పొందుటకై దేవుడు మనలను బాధకరమైన పరిస్థితులలో తీసుకొని పోవును.

## 18. పాలిభాగము

యెరికో శపించబడిన పట్టణము పట్టణ నివాసులు చేసిన అసహ్యమైన పాపముల వలన అది దేవుని ఉగ్రత క్రింద యుండెను (లేవీ. 18:6-25). ఇశ్రాయేలీయులు కలిసి పనిచేసి ఆ దుష్ట పట్టణమునకు తీర్పు తీర్చు ఘనతను కలిగిన వారైరి. విశ్వాసులముగా మనము కూడా దేవుని జత పనివారముగా పిలువబడుచున్నాము. (1 కొరింథీ 3:9.2 కొరింథీ. 9:1) మరియు లోకమునకు, దూతలకును కూడ తీర్పు తీర్చు ఆధిక్యత మనకు గలదు (1 కొరింథీ. 6:2-3) మనము యేసు క్రీస్తు ప్రభువును మన స్వంత రక్షకునిగా అంగీకరించినప్పుడు మనము ఆయనతో కూడ ఏడు విధములైన పాలిభాగములోనికి తీసుకొని రాబడుచున్నాము.

1. పరిశుద్ధాత్మలో పాలి భాగస్థులమగుదుము (హెబ్రీ. 6:4)

2. దైవస్వభావములో పాలివారము (2 పేతురు 1:4)

3. ఆయన పరిశుద్ధతలో పాలివారము ( హెబ్రీ. 12:10)

4. పరలోక సంబంధమైన పిలుపులో పాలివారము (హెబ్రీ 3:1)

5. పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారము (కొలస్సీ. 1:12)

6. ఆయన మహిమలో పాలివారము (1 పేతురు 5:1)

7. క్రీస్తులో పాలివారము (హెబ్రీ 3:14). ఈ అనుభవము లన్నింటిలో పూర్తిగా ఆనందించుట ద్వారా మనము దేవునితో నిజమైన జతపనివారమై ప్రపంచమును సృష్టించిన మన ప్రేమగల పరలోకపు తండ్రియొుక్క మహిమాయుక్తమైన పాలిభాగములోనికి ప్రవేశించ గలము.

## ౹౩. అడ్డంకులు

యెహోషువ 7వ అధ్యాయములో హాయి ముందు ఇశ్రాయేలీయుల ఓటమిని గూర్చి చదువుచున్నాము. ఒక మనుష్యుని జీవితములో నున్న పాపమునుబట్టి ఓడిపోవుదుము. దేవుని కార్యములో మనము ఒక శరీరముగా పని కలిగియున్నాము. క్రీస్తు సంఘముగా మనము సాతానుతో యుద్ధము చేయుచున్నాము. మన జీవితములోని ఏ పతనమైన, తప్పిదమైన సంఘమంతటికి నష్టము చేకూర్చును.

యెహోషువయు, పెద్దలును ప్రార్థనను కొనసాగించగా ఆకాను పాపము బయలు పరచబడెను. దేవుడు కోరిన రీతిగా వారు పాపమును సంధించగా విజయమునకై వారు వాగ్దానములను పొందిరి. దేవుని కార్యములకు ఆటంకము లేకుండ మన హృదయములను పరీక్షించుకొని దేవుని యెదట, మానవుల యెదట విషయములను సరిచేసుకొందము.

## ౨౦. గొప్ప క్రయము

అకాను తన పాపమునకై గొప్ప శిక్ష పొందవలసి వచ్చెను. అయితే మానవులందరి పాపపు తీర్పునకై యేసుక్రీస్తు ప్రభువు ఎంత గొప్ప క్రయము చెల్లించవలెనో ఇది జ్ఞాపకము చేయుచున్నది. మన మాయనకు ఎంత కృతజ్ఞులమై యుండవలెనో గదా!

హయిపై, హాయి రాజుపై, అతని ప్రజలపై పట్టణముపై ఆ ప్రదేశముపై పూర్తి విజయమును వాగ్దానము చేసెను. (యెహో. 8:1) దేవుని ఆజ్ఞలకు విధేయత చూపుట ద్వారా అన్ని విషయములలో వారు జయమును అనుభవించిరి. సాతాను మీద వాని శక్తుల మీద యేసుక్రీస్తు ప్రభువు పూర్తి విజయమును పొందెను. (కొలస్సీ 2:15) మనమాయన ఆజ్ఞలకు విధేయత చూపిన యెడల అనుదినము ఆయన విజయమును అనుభవింపవచ్చును.

ఆయన స్వాస్థ్యమును పూర్తిగా అనుభవించునట్లు విశ్వాసముతో అన్వయించుటకై. అనేక సామాన్యమైన ముఖ్యమైనటువంటి సత్యములు యెహోషువ గ్రంథము చదువుట ద్వారా తెలియపరచబడెను. ఈ అనుభవము మనము కలిగియుండునట్లు దేవుడు మనకు సహాయము చేయునుగాక!

స్వాస్థ్యము వారసునికి చెందినప్పుడు సామాన్యముగా ఆ వారసుడు పొందబోవు స్వాస్థ్యములోని వస్తువుల జాబితా యందు ఆసక్తి కలిగి యుండును. దేవుడు మనకు అనుగ్రహించు స్వాస్థ్యము నందు అనేక ఆశ్చర్యకరమైన ఆశీర్వాదములు కలవు. ఈ ఆశ్చర్యకరమైన ఆశీర్వాదముల యందు యెహోవా యందలి ఆనందమొకటి.

### యెహోవా యందలి ఆనందము (నెహెమ్యా ౮:౧౦)

"యెహోవా యందు ఆనందించుట వలన మీరు బలమొందుదురు" అని నెహెమ్యా 8:10 యొక్క చివరి భాగములో

చదువుచున్నాము. యెహోవా యందలి ఆనందమనగానేమో, ప్రభువు యొద్దనుండి ఇట్టి ఆనందమును పొంది, దాని ద్వారా గొప్ప బలమును కూడ ఎట్లు పొందగలమో చూచెదము.

ఒక పాపి యేసు క్రీస్తు ప్రభువు యొక్క ప్రశస్త రక్తములో కడుగబడుట ద్వారా పాప క్షమాపణ పొందినపుడు, విశేషమైన పరలోక ఆనందమును అతడు పొందును. ఇదియే మనము చదువుచున్న యెహోవా యందలి ఆనందముగా పిలువబడుచున్నది.

ఒకడు తన జీవితమును యేసుక్రీస్తు ప్రభువునకు తృప్తికరముగాను, మహిమకరముగాను కొనసాగించినప్పుడు ఈ ఆనందము హెచ్చుగుచుండును. ఒక పర్యాయము ఈ ఆనందమును పొందిన యెడల అనుదినము దానిని మనము అనుభవించవచ్చును. పై చెప్పబడిన లేఖన భాగములో ఈలాగున వ్రాయబడియున్నది, "తమ కొరకు ఏమియు సిద్ధము చేసికొనని వారికి వంతులు పంపించుడి". దీని భావమేమనగా ఒకరు పొందిన పరలోక ఆనందమును సమస్త ప్రజలతో, అనగా దుఃఖములోనున్న వారితోను, ఇట్టి ఆనందములేని వారితోను పంచుకొనవచ్చును. ఇట్టి యెహోవా యందలి ఆనందము ప్రతి పాపము మీదను, ప్రతిశోధన మీదను జయమును అనుగ్రహించును. ఈ ఆనందము పరలోక సంభంధమైనదని పైనియ్యబడిన లేఖన వచనములో చూచుచున్నాము.

ఈ ఆనందముయొక్క వివిధ లక్షణములను, ఇట్టి గొప్ప ఆనందమును సమస్త ప్రజలు ఎట్లు పొంది, అనుభవించగలరో చూచెదము.

### I. పరిమితిలేని ఆనందము

మొదటిగా : ఇది గొప్ప ఆనందము, అధిక పరిమాణములో మనకియ్యబడుచున్నది, అయితే ఆ దూత - భయపడకుడి, ఇదిగో

ప్రజలందరికి కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను నీకు తెలియచేయుచున్నాను. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" (లూకా 2:10,11). యేసు క్రీస్తు ప్రభువు జన్మించినప్పుడు, దేవదూతలు ఈ వర్తమానమును లోకమునకు అందించిరి. ఈ ఎంతో బలముగా ఈ వర్తమానము తెచ్చిరి. మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియచేయుచున్నాను' ' ఇట్టి గొప్ప ఆనందము (మహా సంతోషము)ను మనకను గ్రహించుటకే యేసుక్రీస్తు ప్రభువు ఈ లోకమునకు వచ్చెను. ఈ ఆనందము నేరుగా పరలోకము నుండి వచ్చునది కనుక, ఈ లోక ఆనందముల మొత్తము కంటే అధికమైనది.

## 2. అందరి కొరకైన ఆనందము

రెండవదిగా : దైవ అధికారముతో సమస్త మానవకోటి నిమిత్తమై ఈ ఆనందము పరలోకము నుండి పంపించబడినది. ఈ ఆనందము "ప్రజలందరికి" యని అనుగ్రహించబడినది. ఇది ఒక రకమైన ప్రజలకనిగాని లేక ప్రజలలో ఒక భాగమునకని ఇయ్యబడలేదు. "ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహా సంతోషకరమైన సువర్తమానము" ఎవరైనను ఈ ఆనందము తమకు మాత్రమే అనుకొనిన యెడల, వారు ఈ తప్పు అభిప్రాయము వలన తమంతట తామే ఆనందము పోగొట్టుకొనుచున్నారు. దేవుడు బైబిల్‌లో చెప్పినదంతయు పొరపాటు లేనిది అది మార్చబడదు. "ప్రజలందరు" అనగా సమస్త దేశముల ప్రజల కొరకు, సమస్త భాషలు మాటలాడు వారికొరకు, అన్ని రకముల ప్రజల కొరకు, ధనికుల కొరకు, పేదవారి కొరకు, చదువుకున్నవారి కొరకు, చదువులేని వారి కొరకు, నాగరికుల కొరకు, అనాగరికుల కొరకు, తెల్లవారి కొరకు, నల్లవారి కొరకు, సమస్త ప్రజల కొరకు దేవుడు ఈ ఆనందమును అనుగ్రహించెను. సమస్త ప్రజలు ఈ ఆనందమును పొందవచ్చును, అనుభవించవచ్చును.

రెండువేల సంవత్సరముల క్రితము యేసుక్రీస్తు ప్రభువు బెత్లెహేములో జన్మించినప్పుడు లోకమంతట అత్యంత అంధకారము అలుముకొని యుండెను. కలవరము, అక్రమము చెలరేగుచున్న కాలమది. రోమీయుల పరిపాలనలో నున్నందున యూదులకవి ధాన్యపు దినములు. దేశమంతటన విగ్రహారాధన యుండెను. దేవుని ప్రజలైన యూదులు దేవుని స్వరము వినగలుగుటకు ఆరాధన స్థలముగాని, ప్రవక్త గాని లేకుండెను. అట్టి కాలములో ఆనంద, సమాధానకరమైన దేవుని వర్తమానము ప్రజలకి అందజేయబడెను. "ప్రజలందరికీ" అనుమాటలో నీవు కూడా ఉన్నావు కనుక ఇది నీకు కాదనుకొని నిన్ను నీవు మినహాయించుకొనవద్దు.

### 3. అపజయమొందని ఆనందము

మూడవదిగా : ఈ ఆనందమును ఎల్లవేళల అనుభవింప వచ్చును. ఇది అప్పుడప్పుడు వచ్చి కొద్దికాలముండునది కాదు. రోగము, దుఃఖము, హింస, బాధ, పేదరికము, ఒంటరితనము, మరణము మొదలగు పరిస్థితుల వలన మన జీవితములో ఎల్లప్పుడు అనేక మార్పులు కలుగుచుండును. కాని ఇది యెహోవా యందలి ఆనందము గనుక అట్టి అసంతోషకరమైన పరిస్థితులలో సహితము ఈ ఆనందమును అనుభవింపవచ్చును. ఇది ఎల్లప్పుడు నిలిచియుండు ఆనందము. ఇది ఎన్నటికి అపజయమొందదు. ఈ ఆనందము విషయమై 1 థెస్సలోని 5:16లో బైబిలు ఏమి సెలవిచ్చు చున్నదో చూతుము. 'ఎల్లప్పుడు సంతోషముగా ఉండుడి' నీ జీవిత కాలమంతయును. అన్ని పరిస్థితులలోను నీవు సంతోషించగలవు. మనము అన్ని రకములైన పరిస్థితుల ద్వారా, శ్రమల ద్వారా, వెళ్లవలసి యుండునని దేవుని వాక్యము హెచ్చరించుచున్నది. అయినను అట్టి దుఃఖముల మధ్య సహితము ఈ ఆనందమును మనము కలిగియుండవచ్చును ఎందుకనగా ఇది యెహోవా యందలి ఆనందము.

## 4. భద్రము చేయబడిన ఆనందము

నాలుగవదిగా : ఈ ఆనందమును, మనయొద్ద నుండి ఎవరును అనగా స్నేహితులుగాని, శత్రువులుగాని, బంధువులు గాని, లేక మరి ఎవరును తీసివేయజాలరు. "మీ సంతోషమును ఎవడును మీ యొద్ద నుండి తీసివేయడు" (యోహాను 16:22). శత్రువులు మన ఇహలోక సంబంధమైన ఆనందమును తీసివేయ వచ్చును. అయితే పరలోక సంబంధమైన ఈ సంతోషమును వారు తీసివేయజాలరు. కొందరు అసూయ వలనను, ద్వేషము వలనను మనపై అన్యాయపు నేరములను మోపి మన ఇహలోక సంబంధమైన సంతోషమును తీసివేయ ప్రయత్నింతురు. అయితే ఈ సంతోషమును, ఎవడును మన యొద్దనుండి తీసివేయుడు" నీ ఆనందమును అట్టిదేనా లేక ఎవరైనా నీ ఆనందమును తీసివేయగలిగిరా? మన ఆనందము నిజముగా పరలోక సంబంధమైనదియు, ఆత్మీయమైనదియునైన యెడల అట్టి ఆనందమును ఎవరును తీసివేయజాలరు.

## 5. అభ్యంతరపడని ఆనందము

ఐదవదిగా : ఇది వింతైన ఆనందము. ఎట్లనగా మనము సమస్తమును పోగొట్టుకొన్నప్పుడును, మనకేమియు లేక పోయినను మనమీ ఆనందమును అనుభవింపవచ్చును. అంజూరపు చెట్టు పూయకుండినను, ద్రాక్ష చెట్లు ఫలింపక పోయినను, ఒలీవ చెట్లు కాపు లేక యుండినను, చేనిలోని పైరు పంటకు రాకపోయినను, గొర్రెలు దొడ్డిలో లేకపోయినను, సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవా యందు ఆనందించెదను. నా రక్షణ కర్తయైన నా దేవుని యందు నేను సంతోషించెదను" (హబక్కూకు 3:17,18). నీవు నీ చేతి గడియారమును గాని, కలమును గాని, ఉద్యోగమును గాని, ఆస్తినిగాని, అధికారమును గాని, పోగొట్టుకొనినను ఈ ఆనందము నిన్ను విడిచిపోదు. 1935వ సంవత్సరములో క్వెట్టాలో భూకంపము కలిగినప్పుడు 58,000 మంది

18 సెకండ్లలో ఎట్లు అకస్మాత్తుగా మరణించిరో నేను స్వయముగా చూచితిని. ఆ క్వెట్టా నగరములో నివసించు చుండిన కొద్దిమంది విశ్వాసులు తమకు కలిగినదంతయు కోల్పోయినను, ఆశ్చర్యరీతిగా మరణము నుండి తప్పింపబడిరి. ఆ సమయములో నేనచ్చట రెండు వారములు ప్రాణాపాయము నుండి వారిని రక్షించుటకు తోడ్పడుచుంటిని మరణము నుండి తప్పింపబడిన ఇతర ప్రజలు దినమంతయు ఏడ్చుచుండిరి అయితే సర్వమును కోల్పోయిన విశ్వాసులు దినమంతయు పాటలు పాడుచు బైబిలు పఠనముల యందు ఆనందించుచుండిరి. తాము పోగొట్టుకొనిన వాటి విషయమై కొంచెమైనను చింతించలేదు. వారి ఆనందము నిజమైనది. అది ఆస్తి, ధనము, పదవి, ఉద్యోగము పై ఆధారపడునది కాదు. ఈ ఆనందములేని వారు ప్రతి చిన్న నష్టమునకు ఎంతో దౌర్భాగ్యస్థితిలో నుందురు, ఏలయనగా వారి ఆనందము ఏదో ఒక లోక సంబంధమైన దానిపై ఆధారపడి యున్నది.

## 6. మారని ఆనందము

ఆరవదిగా : దుఃఖము కూడ ఈ ఆనందమును తీసివేయలేదు. దుఃఖపడిన వారమైనట్లుండియు ఎల్లప్పుడు సంతోషించు వారము, దరిద్రులమైనట్లుండియు అనేకులకు ఐశ్వర్యము కలిగించువారము. ఏమియు లేనివారమైనట్లుండియు సమస్తమును కలిగిన వారము (2 కొరింథీ. 6:10) దుఃఖములో కూడ ఆనందమెట్లుండగలదా అని మీరు ఆశ్చర్యపడుచుండవచ్చును. అయితే అట్టి ఆనందమునిచ్చువాడు దేవుడే. ఉదాహరణముగా సముద్రము యొక్క పైభాగమున ఆగ్రహముతో కూడ నట్టియు, ఎత్తైనట్టియు అలలను మాత్రమే చూడగలవు. యేసు దానిని ఎంతో నిమ్మళముగాను, నెమ్మదిగాను చేయగలిగెను. అదేరీతిగా దేవుని ప్రజలు దుఃఖములలోను, మరణములలోను మరి ఎట్టి శ్రమలలోను, పరిశోధనలలోను తమ హృదయములందు గొప్ప సమాధానమును అనుభవించుదురు.

అట్టి సమయములలో మనము మోకరించి ఇట్లు చెప్పగలము. దేవుడు తప్పు చేయడు. ఆయన ప్రేమ ఎన్నడును మారదు. ఆయన వాక్య మెన్నడును మారదు. అయన సర్వాధికారి. అట్లు ఒకనిజమైన విశ్వాసి విస్తారమైన దుఃఖములలో సహితము తన ఆనందమును పోగొట్టుకొనడు.

## 7. చెప్పనశక్యమైన ఆనందము

ఏడవదిగా : 1 పేతురు 1:8లో అపొస్తలుడైన పేతురు ఈ ఆనందము "చెప్పనశక్యమును మహిమాయుక్తమైన సంతోష"మని చెప్పుచున్నాడు. ఈ ఆనందమును ఒక భాష ద్వారాగాని, పాట ద్వారా గాని వ్యక్త పరచలేము. ఇహలో సంబంధమైన ఏ భాషయు దీనిని వర్ణించలేదు. మనము ఈ ఆనందమును గూర్చి ఎక్కువగా మాట్లాడకపోయినను, మన హృదయములో ఒక వింతైన ఆనందమును అనుభవించుచూ పరలోకములోనున్నట్లుగా భావింతుము. కృపగల దేవుడు ఈ ఆనందము మనకొక ఈవిగా ఇచ్చును. ఈ ఆనందము అద్భుతమును, చెప్పనశక్యమైనదియునై మనలను ఎన్నడును ఎడబాయన్నదు.

## 8. అసాధారణమైన ఆనందము

ఎనిమిదవదిగా : ఈ అనందము భూసంబంధమైన అన్నపానములపై ఆధారపడదు. మన జీవితములలో పరిశుద్ధాత్మ పనిచేయుట ద్వారా మనలోనికి వచ్చు ఆత్మీయ ఆనందమైయున్నది. "దేవుని రాజ్యము భోజనమును పానమును కాదుగాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మ యందలి ఆనందమునై యున్నది" (రోమా 14:17) కొందరి ఆనందము మంచి భోజనముపై ఆధారపడును. ఏ దినముననను వారొక విందుకు వెళ్ళినచో ఆ దినము వారికి చాలా అద్భుతమైనదిగా నుండును. ఒకది ఒక గొప్ప దినము. ఏలయనగా

వారు ఆహారము కొరకై ఎంతో ఆశపడుదురు. వారి ఆనందము కొన్ని సమయముల యందు మాత్రముండునది. అయితే యెహోవా యందలి ఆనందము ఆకలిలోను, కరువులలోను, అనావృష్టిలో కూడా అనుభవింపగలము. నేను నా స్వంత అనుభవమును చెప్పగలను అనేక దినములు నేను ఉపవాసముండవలసి వచ్చినను నా హృదయములో ఎట్టి సణుగులు గాని, అసంతృప్తిగాని లేకుండెను. భూసంబంధమైన వస్తువులు మార్చలేని ఒక ఆనందము నాలో ఉండెను.

ఇప్పుడు అట్టి ఆనందమును మనము నిజముగా పొందియున్నామో లేదో మనలను మనమే పరీక్షించు కొందము. మనలను మనమే మోసపుచ్చు కొనరాదు సాధారణముగా ఎవరైనను వస్తువులు కొనుటకు దుకాణములకు వెళ్ళినపుడు తాము కొనబోవు వస్తువులను బాగుగా పరీక్షించుదురు అయినను అనేకులు చేతి గడియారములు మరి ఇతర విలువైన వస్తువులను కొనినప్పుడు దుకాణదారులచే మోసగింపబడుదురు. ఏలయనగా పైకి చూచుటకు అవి చక్కగాను, ఆకర్షణీయముగాను కనిపించును. వాస్తవముగా అవి అంత విలువైనవి కావు. అయితే ఆ వస్తువుల విషయమై బాగుగా ఎరిగినవారు అనేక విధములుగా వాటిని పరీక్షింతురు కాని అది సరియైనదని ధృడముగా చెప్పలేదు. 2 కొరింథీ. 11:14 లో సాతాను మనలను ఎట్లు మోసపుచ్చగలడో చదువుచున్నాము. యెహోవా యందలి ఆనందమును మనము కలిగి యుండక పోయినను దానిని మనము పొందియే యున్నామని తలంచునట్లుగా వాడు చేయును. అది సరియైనదని చూపించు నటనను సాతాను పుట్టించును.

రైలు బండ్లలో ప్రయాణము చేయు కొందరిని దొంగలే రీతిగా మోసము చేయుదురో చూడుడి. ఒకప్పుడు ఒక మనుష్యుడు అనేకమైన విలువలగల వస్తువులను ఒక పెట్టెలో నుంచుకొని రైలు బండిలో ప్రయాణము చేయుచుండెను. అతడు ఆ పెట్టెకు మంచి తాళము వేసి పైనున్న బెంచిపై తన పెట్టెను పెట్టి నిద్రపోయెను. అతడు

మధ్యరాత్రిలో నిద్ర నుంచి లేని ఆ పెట్టెను తడిమిచూచి అది బరువుగానే యున్నందున భద్రముగానే యున్నదని తలంచి తిరిగి నిద్రించెను. అతడు తన గమ్యస్థానమును చేరిన పిదప పెట్టెను తెరచి చూడగా దాని నిండ రాళ్ళుండుట చూచి ఆశ్చర్యపడెను. ఆ దొంగ పెట్టెను బరువుగా నుంచుటకై దానిలోని విలువగల వస్తువుల నపహరించి, వాటికి బదులుగా రాళ్ళనుంచెను.

ఆ దొంగలవలె సాతాను మనలను మోసగింపకుండునట్లు దేవుని వాక్య వెలుగులో మనలను మనము పరీక్షించుకొని మనము నిజముగా యెహోవా యందలి ఆనందము కలిగి యున్నామని నిశ్చయించుకొనవలెను. దీనిని నిశ్చయించుకొనుటకు ఈ ఆనందమును అనేక పరీక్షల ద్వారా పరీక్షించవలెను.

### 1. పరలోకము నుండి ప్రారంభించును

మొదటిదిగా : యెహోవా యందలి ఈ ఆనందము పరలోకములో ప్రారంభమగును. ఈ ఆనందము భూమి మీదగాని, పరలోకములోనే ప్రారంభమగునని లూకా 15:10లో వ్రాయబడి యున్నది. పరిశుద్ధాత్మ దేవుడు ఆయన వాక్యము ద్వారా ఒక మనుష్యుని హృదయములో నిజమైన ఒప్పుదలను, పశ్చాత్తాపమును తీసుకొనివచ్చును. అతడు తన పాపముల విషయమై నిజముగా పశ్చాత్తాపపడి, ప్రభువైన యేసు క్రీస్తు తన పక్షముగా సిలువలో మరణించెనని నమ్మినపుడు, పరలోకములో దేవుని దూతల యెదుట ఆనందము కలుగును. ఒక పాపి పశ్చాత్తాపపడినపుడు వెంటనే దేవుడు పరలోకపు వాయిద్యములను వాయించు తన దూతల నందరిని పిలుచును. అదే పరలోకపు ఆనందము, పశ్చాత్తాపపడి మారిన ఆ పాపి హృదయములో పోయబడును. కావున అది పరలోకము నుండి వచ్చిన ఆనందము. ఈ ఆనందము ఒక బోధకుని నుండి కల్గు మానసంబంధమైన ఆనందమైతే త్వరలోనే వెడలిపోవును. ఒకనాడు వారు

కూటములో తమ చేతులను చూపి తిరిగి జన్మించితిమని చెప్పవచ్చును. అయితే మరునాడు బహుస్వల్పమైన కారణమునకే కలతచెంది, కూటములకు వచ్చుట మానెదరు. అయితే పరలోకము నుండి ఒక మానవుని హృదయములోనికి పోయబడిన ఈ ఆనందము యెన్నటికిని వెడలిపోదు.

అందువలననే బాప్తిస్మమిచ్చు యోహాను మారు మనస్సును గూర్చి ప్రకటించుచు, 'మారు మనస్సుకు తగిన ఫలములు ఫలించుడి' అనెను. ప్రభువైన యేసుక్రీస్తు ప్రకటించుచు ఈలాగు సెలవిచ్చెను. 'పరలోక రాజ్యము సమీపించి యున్నది కనుక మారు మనస్సు పొందుడి' (మత్తయి. 4:17) ప్రభువైన యేసుక్రీస్తు, బాప్తిస్మమిచ్చు యోహానును పరిశుద్ధాత్మతో నింపబడినవారై ప్రకటించిరి. మానవులు తమ పాపముల నిమిత్తమై పశ్చాత్తాప పడినపుడు అది పెదవుల నుండి కాక హృదయము నుండి పశ్చాత్తాపపడవలెను. గనుక మనము పశ్చాత్తాప పడునపుడు భయము చేతగాని లేక ఇతరులు మన విషయమై ఏమని తలంతురోయని గాని లేక మంచి పేరు నిలువబెట్టుకొనుటకు గాని పశ్చాత్తాపపడరాదు. కొందరికి పశ్చాత్తాపము విషయమై సరియైన అభిప్రాయము లేదు. వారు ' ఓ దేవా! నేనీ పాపము చేసిన యెడల లేక ఆ పాపము చేసిన యెడల నన్ను క్షమింపుము' అని చులకనగా ప్రార్థింతురు. వారికి వారి పాపముల దుస్థితి విషయమై సరియైన ఒప్పుదల దుఃఖము' లేదు.

"యోబు విషయములో దేవుడు నీవీ పాపమును చేసితివి" అని అతనితో సెలవియ్య నవసరము లేదు. అతనికి దేవుని ప్రత్యక్షత కలిగెను. దేవుని మహిమా సౌందర్యములను. ఆయన గొప్ప శక్తిని, ప్రత్యక్షత ద్వారా అతడు తెలుసుకొనెను. దేవుని విషయమై అట్టి ప్రత్యక్షత అతనికి ఎన్నడును కలుగలేదు. ఈ ప్రత్యక్షత. దేవుని సన్నిధిలో తన్నుతాను అసహ్యించుకొనునట్లును, ద్వేషించుకొనునట్లును చేసెను.

ఎందుకనగా అతడు తన స్వంత పనికిమాలిన స్థితికి, దేవుని పరిశుద్ధతకు మధ్యనున్న గొప్ప వ్యత్యాసమును గుర్తించెను.

అదేరీతిగా లూకా 5:8లో సీమోను పేతురు యేసు మోకాళ్ళ యెదుట సాగిలపడి 'ప్రభువా! నన్ను విడచిపొమ్ము, నేను పాపాత్ముడను' అని చెప్పెను. మన ప్రభువు సీమోను పాపము విషయమై అతనిని గద్దించలేదు, లేక అతని పాపమును బయలు పరచలేదు. అయితే పేతురు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శక్తిని, ప్రభావమును, ఘనతను కనుగొనినపుడు తానే తన పాపముల విషయమై బహిరంగా ఒప్పింపబడెను. మరియు లూకా 19:8లో జక్కయ్య మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడినట్లు చూడగలము. మన ప్రభువు, జక్కయ్య తన ఉద్యోగములో తాను చాలా మోసము చేయుచుండెనని అనలేదు. తన గృహములో ప్రభువు యొక్క సాన్నిధ్యమే, తనలో మారు మనస్సును, నిజమైన పశ్చాత్తాపమును కలిగించెను. ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదలకిచ్చు చున్నాను. నేనెవని యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. (లూకా 19:8) కనుక నిజమైన పశ్చాత్తాపము ద్వారా ఆనందము పరలోకము నుండి యెట్లు మనలోనికి వచ్చునో, పశ్చాత్తాపపడిన వాని హృదయము లోనికి ఈ ఆనందమెట్లు పోయబడునో చూడగలము.

## ౭. గొర్రెపిల్ల జీవగ్రంథము

మన పేర్లు గొర్రెపిల్ల యొక్క జీవగ్రంథములో వ్రాయబడెననుటయే ఈ ఆనందము యెహోవా నుండి కలిగిన దనుటకు రెండవ నిశ్చయతగా యున్నది.

లూకా 10వ అధ్యాయములో మన ప్రభువు తన డెబ్బది మంది శిష్యులను ఇద్దరిద్దరినిగా సువార్త ప్రకటించుటకు, రోగులను బాగుపరచుటకు పంపెను. వారి పరిచర్యను వారు ముగించిన పిమ్మట గొప్ప సంతోషముతో తిరిగివచ్చిరి. వారితో మన ప్రభువు "అద్భుత

కార్యములు నిజమైన సంతోషమును ఇవ్వవు గనుక వాటియందు ఆనందించకుడి అని చెప్పెను. ఈ భూమిపై మన ప్రభువు తన మూడున్నర సంవత్సరముల సేవలో అనేక అద్భుత కార్యములను జరిగించెను. ఈ అద్భుతములు చూచి కొందరు ప్రజలు ఆశ్చర్యపడి వాటిని చూచు నిమిత్తమే ప్రభువును వెంబడించిరి. అదే ప్రజలు తరువాత 'ఆయనను సిలువ వేయుడి, సిలువ వేయుడి' అని అరచిరి. వారు పొందిన ఆ ఆనందము తాత్కాలికమును పైపైన నుండినది, త్రాగుబోతు త్రాగిన పిదప తనకు తానే రాజుగా నెంచుకొని ఇట్టి ఆనందమును పొందును. మత్తు వదలిన పిమ్మట పిచ్చి వానివలె ప్రవర్తించినందులకు తన్ను గూర్చి తాను సిగ్గు చెందును. అందువలన మన ప్రభువు శిష్యులను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషించక పరలోకమందు మీ పేరులు వ్రాయబడి యున్నవని సంతోషించుడి'' అని హెచ్చరించుచున్నాడు (లూకా 10:20) నీవు భూలోకములో నున్నప్పుడే నీవు పరలోకములో అంగీకరించబడియున్నావని నిశ్చయము చేసికొనుము. పరలోకములో ఎవరును క్రొత్తగా నుండరు. భూమి యందు మాత్రమే ప్రజలు ఒకరితో నొకరు పరిచయము చేసికొనుటకు విచారణ చేయుదురు. పరలోకములో మనము సంతోషముగా ఆహ్వానింపబడుదుము మరియు మనము దేవుని కుటుంబమగు ఒకే కుటుంబమునకు చెందినవారము గనుక ముందుగానే అందరిని ఎరుగుదుము.

### 3. దేవుని సన్నిధి గుర్తింపు

మూడవదిగా : దేవుని సన్నిధిని గుర్తించుట ద్వారా మన ఆనందము దేవుని నుండియే వచ్చెనని నిశ్చయింపవచ్చును.

దేవుని సన్నిధిని ఎడతెగక గుర్తించుట వలన ఈ ఆనందము మనకు కలుగును. ఆయన సన్నిధిలో మనము అత్యధికముగా గడిపినపుడు, దేవుని సన్నిధి సహాయము నడిపింప వలన మనము

అధికముగా ఈ పరలోకపు ఆనందమును పొందుదుము. ఎక్కువ కాలము బైబిలు చదివి, ప్రార్థన చేసిన యెడల మనకు మహానందము కలుగును. అసూయ ద్వేషము మొదలగు పాపములు మనలో నున్న యెడల దేవుని సన్నిధిని గుర్తించలేము. ఈ ఆనందము మనలను విడిచిపోవును. తిరిగి మన సమస్త పాపములు, కొరతల విషయమై పశ్చాత్తాపపడిన యెడల ఆనందము మరలా మనకను గ్రహించబడును. ప్రభువును ఆరాధించుచు దేవుని వాక్యమును చదువుచు, ప్రార్థన మూలమున ఆయనతో సన్నిహిత సహవాసములో, నుండిన యెడల ఈ ఆనందములో కొనసాగ గలము.

## 4. తిరుగులేని విధేయత

నాలుగవదిగా : మనము దేవుని వాక్యమునకు తిరుగులేని విధేయత చూపించుటలో మన ఆనందము దేవుని నుండియే వచ్చెనని నిశ్చయింపవచ్చును. యిర్మీయా 15:16 లో వ్రాయబడిన రీతిగా దేవుని వాక్యమును అంగీకరించి లోబడుట ద్వారా ఆ ఆనందమును పొందగలము. అతనిని ద్వేషించుచున్న ప్రజలకు ప్రవక్తగా నుండు బహు కఠినమైన పనిని దేవుడు యిర్మీయాకు అప్పగించెను. వారు అతనిని చూచి నవ్విరి, ఎగతాళి చేసిరి. అతనిని గోతిలో కూడా పడవేసిరి. అయినను యిర్మీయా దేవుని వాక్యము నంగీకరించి, లోబడెను. ఆ రీతిగా అతని ఆనందము అధిక మాయెను. దేవుని వాక్యమునకు లోబడుట ద్వారా మన ఆనందము విస్తరించెను.

## 5. ఆత్మలు రక్షింపబడుట

ఐదవదిగా : రక్షణలోనికి ఇతర ఆత్మలను నడిపించుటలో మన ఆనందము దేవుని యొద్ద నుండి వచ్చెనని నిశ్చయింప వచ్చును. థెస్సలోని కయలోనున్న విశ్వాసులకు 1వ థెస్స 2:20లో పౌలు ఈ రీతిగా వ్రాసెను. మీరే మహిమయు, ఆనందమునై యున్నారు" థెస్సలొనీకయలోని ప్రజలు హింసలలోకూడా ప్రభువు వాక్యమును

అంగీకరించి నమ్మకముగా నుండినట్లు అపొస్తలుల కార్యములు 17వ అధ్యాయములో చదువచున్నాము. వారినిబట్టి తన శ్రమల నన్నింటిని మరచి పొగలుగుచున్నాడని పౌలు రోమా నుండి వ్రాసెను. వారే తన మహిమయు, ఆనందమునై యున్నారని అతడు పలికెను. కిరీటమునకు యోగ్యులుగా దేవుని యెదుట వారు నిలుచుచుందురను నిరీక్షణ అతడు కలిగియుండెను. అదేరీతిగా, మన ప్రార్థన, ప్రేమ, సేవ, త్యాగముల వలన రక్షింపబడిన వారిని దీర్ఘకాలము తరువాత కలుసుకొనిన యెడల మిక్కిలి ఆనందమును పొందెదము. మన జీవితము, సాక్ష్యముల ద్వారా రక్షింపబడిన అనేకులను పరలోకములో చూచెదము. అందువలననే తిరిగి జన్మించని మన బంధుమిత్రాదుల కొరకు, ప్రియుల కొరకు ఎడతెగక ప్రార్థించవలెను.

### 6. కదలింపబడనిది

ఆరవదిగా : శ్రమలలో మనము కదలింప బడకుండుటయే ఈ ఆనందము దేవుని నుండి వచ్చెనని నిశ్చయింపవచ్చును. అపొస్తలులు హింసింపబడినపుడు, సణుగుటకు బదులు సంతోషించినట్లుగా అపొ కార్య 5:41లో చదువుచున్నాము. వారు నిందించబడిరి. కొట్టబడిరి, వెలివేయబడిరి, ద్వేషించబడిరి అయినను వారు సంతోషించుచుండిరి. ఎందువలననగా, ఆయన నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున, అదేరీతిగా, క్రీస్తు ప్రభువు నిమిత్తము మనము అవమానపరచబడి, నిందించబడినపుడు విశేషమైన ఆనందము మనలో కలుగుట చూడగలము. నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునపుడు మీరు ధన్యులు. సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును. ఈలాగున వారు మీకు పూర్వమందుండిన ప్రవక్తలను హింసించిరి. (మత్తయి 5:11,12). కాని మొట్టమొదట అట్టి యెహోవా యందలి ఆనందము లేనియెడల, ఎవరైన నిన్ను నిరాకరించినను లేక ద్వేషించినను లేక తృణీకరించినను, అనేక దినములు నీవు నిద్రను

ఆకలిని కోల్పోవుదువు. కాని యెహోవా యందలి ఆనందమును నీవు కలిగియున్నయెడల యీ ఆనందము తగ్గిపోదు. నీవు వెళ్ళు శ్రమలలో నిందలలో అవమానములలో అది అధికమగును. మనలను నిరుత్సాహపరచుటకు శత్రువు (సాతాను) శాయశక్తులా ప్రయత్నించును. అందువలననే దేవుని వాక్యమందు 1 పేతురు 4:12-14లో మనకొక హెచ్చరిక యున్నది. 'ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమను గూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచ బడినపుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారై యున్నంతగా సంతోషించుడి. క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైన యెడల మహిమా స్వరూపి అయిన ఆత్మ అనగా దేవుని ఆత్మ మీమీద నిలుచుచున్నాడు కనుక మీరు ధన్యులు." ఇతరులు మనలను అగౌరవపరచినను లేక ద్వేషించినను లేక శపించినను యీ ఆనందము వెళ్ళిపోదు.

### 7. నివాసము

ఏడవదిగా : పరలోకపు నివాసముపై మనకున్న గొప్ప నిరీక్షణ. మన ఆనందము ప్రభువు యొద్దనుండియే వచ్చెనని నిశ్చయింపవచ్చును. ఒక దినమున యేసుక్రీస్తు ప్రభువు తన మహిమ యెదుట ఆనందముతో మనలను నిర్దోషులనుగా నిలవబెట్టనై యున్నాడను నిరీక్షణ ద్వారా ఈ ఆనందము మనకు కలుగును. ఈ భూమి మీద పతనములతో కొరతలతో మనము నిండియున్నాము. కాని యేసుక్రీస్తు ప్రభువు సమస్త దూతలతో రెండవ రాకడలో మహిమతో ప్రత్యక్షమయినపుడు, మనము ఆయన యెదుట నిర్దోషులముగా నుందుము. దూతలు సహితము మనలో నెట్టి దోషమును కనుగొనలేరు. ముఖాముఖిగా ఆయనను చూచుదమను నిరీక్షణ మనము కలిగియున్నాము. అందువలననే యోగ్యమయిన రీతిగా మనము ఆయన బల్లలో పాలుపొందవలెను.

ఆ దినమున అయినను ముఖాముఖిగా చూడగలుగునట్లు ఆయన రెండవ రాకడకు మనము సిద్ధముగా నుండవలెను.

## 8. పెండ్లి కుమారుడు

ఎనిమిదవదిగా : పెండ్లి కుమార్తెగా పెండ్లి కుమారుని సంధించెదమనుటలో మన ఆనందము దేవుని యొద్దనుండి వచ్చెనని నిశ్చయింపవచ్చును. పెండ్లి కుమార్తెగా సంపూర్ణముగా ఆయనతో సంయుక్త పడనైయున్నవారికి ఈ ఆనందము లభించును. పెండ్లికుమారుడు, పెండ్లి కుమార్తె పరిపూర్ణమైన ప్రేమతో నిండి, వారి తలంపులు, ఆస్తిపాస్తులు పంచుకొనరీతిగా ప్రభువుతో ఏకమైనప్పుడు సమస్తమును ఆయనతో మనము కూడా పంచుకొనవచ్చును. శాశ్వతముగా ఆయన పాలిభాగస్తులముగా, సహచరులముగా నుండుటకై మనము ఎన్నుకొనబడితిమి. అట్టి ఆనందము లేక నిరీక్షణ లేనివారు దేనికొరకును వేచియుండలేరు. ఇతరులతో పంచుకొనుటకు వారికేమియు లేదు. మంచి భోజనము కొరకు కొందరు భర్తలు తమ భార్యలను పీడించుచుందురు. వారికది లభించక పోయిన యెడల వారు బహు రౌద్రులగుదురు. ఇదంతయు వారు యెహోవా యందలి ఆనందమును గూర్చి ఎరుగక పోవుటయు వారి భార్యలతో ఈ ఆనందము పంచుకొన లేకపోవుటవలనే. తమ మాట ప్రకారము సమస్తము తమకు జరుగవలెనని మాత్రమే కోరుచుందురు. కనుక వారికి ఏకమనస్సు లేక ఐక్యత యుండదు. ఈ భూమి మీద ఒకరితో నొకరము పంచుకొన్నప్పుడు మన ఆనందము అధికమగును. మోకరించి ప్రభువుతో ధారాళముగా మన తలంపులను, ఆశలను పంచుకొనిన తర్వాత మనకు తానేమి నేర్పించ గోరుచున్నాడో, ఆయనను సంతోషపరచుటకు మనమేమి చేయవలెనో పంచుకొనుమని ప్రభువును అడుగునప్పుడు మన ఆనందము అధికమగును.

## 9. సన్నిహితత్వము

తొమ్మిదవదిగా : మనకు దేవునితో గల సన్నిహిత సంబంధము మనకున్న ఆనందము దేవుని యొద్దనుండియే వచ్చెనని నిశ్చయింప వచ్చును.

మనము మోకరించి మన తలంపులను, కోరికలను ఆయనతో ధారాళముగా పంచుకొని, ఆయన మనకేమి బోధించగోరుచున్నాడో అడిగి ఆయనను సంతోషపెట్టుటకు మనకేమి చేయవలెనో అడిగినచో, మన ఆనందము అధికమగును. ఆది కాం. 18:17,18లో మనము చదివినట్లు ప్రభువు అబ్రాహాముతో తన తలంపులను పంచుకొనెను. "నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా? బ్రాహాము నిశ్చయముగా బలముగల గొప్ప జనమగును. అతని మూలముగా భూమిలోని సమస్త జనములను ఆశీర్వదింపబడును" అబ్రాహాము తన స్నేహితుడనియు, అతనికి తానేమియు దాచలేననియు ప్రభువు సెలవిచ్చు చున్నాడు. బలమైన గొప్ప దేవుడు అబ్రహాము విషయమై ఈ మాటలు పలికి ఆ ప్రజల దుర్మార్గతను బట్టి సొదొమ గొమొర్రాలను నాశనము చేయు విషయమై తన మనస్సును అతనితో పంచుకొనెను. మన ప్రభువు బేతనియలో నున్న మార్త, మరియలతో కూడ తన తలంపులను పంచుకొని యుండవచుచను. ప్రభువు యెరూషలేము నుండి వారి యింటికి వెళ్ళినప్పుడెల్ల తాను దేవాలయములోనికి వెళ్ళిన విషయమును మరియు అక్కడ చుట్టు ఆయన కనుగొనిన చెడుగును గూర్చి వారితో పంచుకొని యుండవచ్చును. ఈ విధముగా మనము కూడా మన తలంపులను ప్రభువుతో పంచుకొనవలెను. మనము ప్రార్థించినప్పుడెల్లా ఏదో ఒకదానిని అడుగుట కొరకే వెళ్లుచుందుముగాని, ప్రభువు మనతో పంచుకొనగోరు దానిని తెలిసికొనుటకై వేచియుండము. అనేక పర్యాయములు ప్రభువు ఉదయకాలముననే నన్ను లేపి ఏదో ఒక స్థలమునకు పొమ్మని నాతో కొన్ని విషయములను పంచుకొనుట నేను అనుభవించితిని. ఆయన మనతో నేది పంచుకొనగోరుచున్నాడో

అది తెలిసికొనుట ఆనందము. ఆయన కొరకు మనమేది చేయగోరు చున్నాడో దానిని చేయుట మరిగొప్ప ఆనందము.

యెహోవా యందలి ఆనందమనగా నేమో దానిని ఎవరైనను ఏ విధముగా పొందగలరో లేఖనముల ద్వారా మనము చూడగలిగితిమి. ఇదే ఆనందము మనకు బలముగా కాగలదు. మన ప్రభువు మనకు అట్టి ఆనందమును అనుగ్రహించి దానిని అభివృద్ధి చేయునుగాక!

★